క్లుప్తంగా

9 మంది ట్రిపుల్ ఐటీకి ఎంపిక



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 9 మంది పదో తరగతి విద్యార్థులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తోట వెంకటేశులు తెలిపారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే కాక, దాదాపు 55 మంది విద్యార్థులు 500 మార్కులకుపైగా సాధించినట్లు తెలిపారు. ఇటీవల వెలువడిన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో మోడల్ స్కూల్‌కు చెందిన తొమ్మిది మంది ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన వారిలో గౌతమి, జిగ్నేష్, అమోఘ్, బీకే సోహెల్, నాగవేణి, చందన, సంధ్య, మౌనిక, భానుప్రసాద్ ఉన్నట్లు తెలిపారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



కూడేరు: మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న

కూడేరు: మహిళలపై దాడులను ప్రభుత్వం అరికట్టాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కూడేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించకపోవడం దారుణమన్నారు. నిందితులపై చర్యలు తీసుకోకపోవడంతోనే దారుణాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, మహిళా నేతలు లక్ష్మీదేవి, ఈరమ్మ, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీరాములు, నాయకులు రాయుడు, జగన్నాథ్, సిద్దప్ప పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



గంగవరంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

బెళుగుప్ప: గ్రామ సచివాలయాల్లోని సిబ్బంది, అధికారులు తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని దుద్దేకుంట, గంగవరం, శీర్పి గ్రామ సచివాలయాలను మండల పీఆర్‌ఈఓఆర్‌డీ మాధవరెడ్డితో కలసి ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని సిబ్బంది హాజరు పుస్తకాన్ని, బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కంబదూరు: మండలంలోని నూతిమడుగులోని ఏపీఆర్‌ఎస్ గురుకుల బాలుర పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యాధికారి అశోక్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులైన డెంగీ,మలేరియా,టైఫాయిడ్, అతిసారా తదితర వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్క విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

18న వన్ కే వాక్

కళ్యాణదుర్గం: మండల లీగల్‌సెల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఈనెల 18న వన్ కే వాక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బండే సుభాన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు దొడగట్ట రోడ్డు నుంచి టీ సర్కిల్ మీదుగా ముదిగల్లు క్రాస్ వరకు హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పోలీసులు, న్యాయవాదులు, విశ్రాంత ఉద్యోగులు, యువత పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అలరించిన 'సౌందర్య లహరి'

అనంతపురం కల్చరల్: జగద్గురు శంకరాచార్యులు రచించిన సౌందర్య లహరిపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. సంగీత విదూషిమణి గుంటూరు సంధ్యామూర్తి నేతృత్వంలో స్థానిక అశోక్‌నగర్‌లోని రమా సమేత సత్యనారాయణస్వామి ఆలయం వేదికగా పదిరోజుల పాటు శిక్షణ ఇచ్చారు.

కనుల పండువగా మొహర్రం



కళ్యాణదుర్గంలో కొలువుదీరిన పీర్లు



రాయదుర్గంలో పూజలందుకుంటున్న ఉచ్చుబాయి పీర్లు



బెళుగుప్పలో పీర్ల చావిడి నుంచి జలధికి తరలుతున్న పీర్లస్వాములు

- నేడు జలధికి తరలివెళ్లనున్న పీర్లు

కళ్యాణదుర్గం/రాయదుర్గం:కళ్యాణదుర్గం మున్సిపాలిటీ, రాయదుర్గం నియోజకవర్గాల్లో కనుల పండువగా మొహర్రం వేడుకలు జరిగాయి. మంగళవారం రాత్రి పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పానకం బిందెలతో పీర్లకు మొక్కులు తీర్చుకున్నారు. డప్పుల వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి భక్తులు పీర్ల గుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఏటా మొహర్రం సందర్భంగా భక్తులు బెల్లం, చక్కెరను తులాభారం వేయడం ఆనవాయితీ. మరికొందరు వెండి గొడుగులు స్వామికి అందించారు. రాత్రి పొద్దుపోయేవరకూ పీర్లను వీధుల్లో ఊరేగించారు. అనంతరం బుధవారం జలధి ఉంటుంది.

అల్లర్లు జరిగితే చర్యలు..

మొహర్రం సందర్భంగా ఎక్కడైనా అల్లర్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.శ్రీనివాసులు హెచ్చరించారు. మొహర్రం వేడుకలు పూర్తయ్యే వరకు ఎలాంటి చిన్న సంఘటనలు జరిగినా నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో ఏదైనా అల్లర్లు జరిగితే సహించేదిలేదని డీఎస్పీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు వేడుకలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో పలు చోట్ల మంగళవారం పెద్ద సరిగెత్తు (9వ రోజు) వేడుకలు ఘనంగా జరిపారు. అగ్నిగుండాల(అలాయి) వద్ద రాత్రి అలాయ్ ఆడారు. బళ్లారి రోడ్డులో వెలసిన ఉచ్చుబాయి పీర్ల దర్శనానికి ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పోటెత్తారు. గొందిబావిలోని పెద్దపీర్ల చావిడి, చమ్మా పీర్లచావిడికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. చక్కెర, పానకాలు సమర్పించేందుకు క్యూకట్టారు. అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండంలో ఉప్పు వేస్తూ ప్రదక్షిణలు చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. గొందిబావిలోని పెద్ద పీర్ల మకాన్, చమ్మా పీర్లమకాన్, ఆత్మకూరు వీధిలో వెలసిన లద్దూ, నింబూసా మకాన్ పీర్ల చావిళ్లలో ప్రత్యేక ఫాతేహ కార్యక్రమాలు నిర్వహించారు. కులమతాలకతీతంగా భక్తులు తరలివచ్చి, చక్కెర చదివింపులు సమర్పించారు. ఆయా పీర్ల చావిడిల వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. బుధవారం కోట ఊరు వాకిలి వద్ద పీర్ల ఊరేగింపు (జలధి) నిర్వహిస్తున్నట్లు ముజావర్లు తెలిపారు.

ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

పట్టణంలో మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం నేసేపేటలోని సత్యనారాయణస్వామి గుడి ఏరియాకు చెందిన కళాకారులు ప్రదర్శించిన పులి వేష ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. పెద్ద పులి వేషంతోపాటు ఎడంబీ ప్రదర్శన అదుర్స్ అనిపించింది. తొలుత మంగళవారం తెల్లవారుజామున మహిమాన్విత ఉచ్చుబాయి పీర్ల చావిడి వద్ద పులి వేష ప్రదర్శన చేశారు. అనంతరం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పులి వేషాల ప్రదర్శన చేశారు.

బెళుగుప్పలో జలధికి తరలిన పీర్లస్వాములు

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో మొహర్రం వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే వన్నూరస్వామి పీర్లచావడి వద్ద పీర్లస్వాములు మంగళ వాయిద్యాల నడుమ వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశం చేశారు. సాయంత్రం భక్తులు పీర్లస్వాములకు బెల్లం చదివింపులతో ప్రార్థిస్తూ ముజావర్లు ప్రత్యేక ప్రార్థనల అనంతరం జన సందోహం మధ్య అగ్నిగుండాన్ని పూడ్చివేసి, పీర్ల స్వాములను జలధికి తరలించారు. మండలంలోని విరుపాపల్లి, ఎర్రగుడి, యలగలవంక, రామసాగరం, శీర్పి, కాలువపల్లి, జీడిపల్లి గ్రామాల్లోని పీర్లస్వాములకు పెద్ద సరిగెత్తుతో చక్కెర చదివింపులు చేశారు. బుధవారం జలధి కార్యక్రమాలు కొనసాగనున్నాయి. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ శివ పోలీస్ సిబ్బందితో శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో పెద్దసరిగెత్తు

ఉరవకొండ:హిందూ-ముస్లింల ఐక్యతకు చిహ్నంగా జరుపుకునే మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం పెద్ద సరిగెత్తు వేడుకలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలో ప్రసిద్ధిగాంచిన నాల్గో వార్డు లాలుస్వామి పీర్ల చావిడి వద్ద వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామికి చక్కెర, బెల్లం చదివింపులు చేశారు. అనంతరం ఎడ్లబండ్లలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద దుంగలను (మొద్దులు) తీసుకొచ్చి అగ్నిగుండంలో వేశారు. లాలుస్వామికి భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు చెక్కర, బెల్లం తులాభారాన్ని వేయించారు. గాంధీచౌక్ వద్ద ఉన్న గురికాల పీర్లచావిడి వద్ద భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఉత్సవాల్లో భాగంగా నేడు పీర్లు జలధి నిర్వహించనున్నారు.

ఘనంగా సరిగెత్తు వేడుకలు

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, గలగల, నేత్రపల్లి , గోనబావి, గొల్లపల్లి, భూపసముద్రం, బేలోడు, గుమ్మఘట్ట, పూలకుంట, తాళ్లకెర గ్రామాల్లో ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, బండూరు, కొలగానహళ్లి, ఏళంజి, కానాపురం, దర్గాహొన్నూరు, కల్‌హోళ, తదితర గ్రామాల్లో పీర్ల పండుగ ఘనంగా నిర్వహించారు. భక్తులు పీర్ల చావిడికి వెళ్లి చదివింపులు చేస్తుకున్నారు. రాత్రి పెద్ద సరిగెత్తు నిర్వహించారు. బుధవారం ఉదయం పీర్ల దేవుళ్ల ఊరేగింపు, సాయంత్రం జలధి ఉంటుంది.

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలో మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం పెద్ద సరిగెత్తు వేడుకలు నిర్వహించారు. పీర్ల చావిడిలో పీర్ల స్వాములను వెండి ఆభరణాలు, రంగుల వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి, కొలువు దీర్చారు. పెద్దసరిగెత్తు సందర్భంగా పీర్లను దర్శించుకునేందుకు భక్తు పెద్దఎత్తున తరలివచ్చారు.

పీర్ల చావిడీలో ప్రత్యేక ప్రార్థనలు

రాయదుర్గం: పట్టణంలోని చమ్మమసీదులో పీర్లకు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చక్కెర చదివింపుల చేశారు. పీర్ల గుండం చుట్టూ ప్రదక్షిణ చేశారు. పండుగను అన్ని కులాలు, మతాల వారు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట చమ్మా హిబ్రహీమ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కూడేరులో భక్తిశ్రద్ధలతో పానకాలు

కూడేరు: కూడేరులో మొహర్రం వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం పానకాల మహోత్సవాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఫక్కీర్లు మరువలో పానకాలు తీసుకొని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం పీర్ల దేవుళ్లకు చక్కెర చదివింపులు చేయించారు. ముజువార్ మైనుద్దీన్ పీర్ల దేవుళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, చక్కెర చదివింపులు చేశారు.



ప్రత్యేక అలంకరణలో గురికాల వీధిలో పీర్లు



ఉరవకొండలో పానకాలు తీసుకొస్తున్న భక్తులు



బొమ్మనహాళ్: కొలువుదీరిన పీర్లు



రాయదుర్గం: చక్కెర చదివిస్తున్న నాయకులు

మందులతో కుష్టు పూర్తిగా నయం

- డీపీఎంఓ సత్యనారాయణ



కూడేరు: పుండ్లు కాకుండా ఎలా శుభ్రం చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కూడేరు: కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి, క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని డీపీఎంఓ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని కుష్టు రోగుల కాలనీలో 'అంగవైకల్య నివారణ - వైద్య పునరావాస' కార్యక్రమంపై కుష్టు వ్యాధిగ్రస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి ప్రాథమిక దశ దాటి మందులు వాడుతున్న వారు తప్పక పరిశుభ్రత పాటించాలని డీపీఎంఓ సత్యనారాయణ తెలిపారు. లేదంటే కాళ్లు,చేతి వేళ్లకు పుండ్లు ఏర్పడి ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎస్‌ఎం బాను, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గిరిజన బాలిక ఆచూకీపై పట్టించుకోరా?



బాలిక ఆచూకీ కనిపెట్టాలని కోరుతున్న వాల్మీకి సంఘం నాయకులు

ఉరవకొండ: నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో గిరిజన బాలిక అదృశ్యమై సంచలనం సృష్టించినా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నోరుమెదపకపోవడం సిగ్గుచేటని మార్కెట్ యార్డు చైర్‌పర్సన్, వాల్మీకి సంఘం నాయకురాలు బోయ సుశీలమ్మ, డిష్ సురేష్ అన్నారు. మంగళవారం వజ్రకరూరులో విలేకరులతో మాట్లాడారు. ముచ్చుమర్రిలో బాలిక అదృశ్యమైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తుందన్నారు. పోలీసులు కేసును తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వం వాసంతి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించి, కుటుంబానికి ఐదెకరాల భూమి, ఇంట్లో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నేతలు నారాయణప్ప, శ్రీరాములు, రాకెట్ల బాబు, నెట్టికల్లు శివ, వెంకటేసు, గోవిందు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక కృషి

- ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీఎన్ శ్రీదేవి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీఎన్ శ్రీదేవి

కళ్యాణదుర్గం: బాల్య వివాహాలను అరికట్టేందుకు అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీఎస్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక వివేకానంద ప్రైవేట్ కళాశాలలో సాయి లిఖిత శక్తి సదన్ అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన మహిళలపై జరుగుతున్న వేధింపులపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పాటు రూరల్ సీఐ నాగరాజులు హాజరై మాట్లాడారు. బాలల రక్షణ కోసం 1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు, మహిళల రక్షణ కోసం 181 హెల్ప్ లైన్‌కు కాల్స్ చేయాలని సూచించారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో బాల్య వివాహాల సంఖ్య అధికమవుతోందని, బాల్య వివాహాలను అరికట్టేందుకు యువత చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రామలింగప్ప, పద్మావతి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, వన్‌స్టాఫ్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ శాంతామణి, లీగల్ కౌన్సిలర్ నర్మద, అడ్వకేట్ శివన్న, కళాశాలల ప్రిన్సిపాళ్లు బాబా షామీర్, శక్తి సదన్ సూపరింటెండెంట్ శ్యామల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేమకల్లు వద్ద పంట పొలాల పరిశీలన



పంట పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామాంజనమ్మ

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామ శివారులో పంట పొలాలను తహసీల్దార్ రామాంజనమ్మ మంగళవారం పరిశీలించారు. నేమకల్లు వద్ద ఉన్న స్పాంజ్ ఐరన్ కర్మాగారాల నుంచి వెలువడే కాలుష్యంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని, రైతులకు ఫ్యాక్టరీల యాజమాన్యం పట్టించుకోలేదని ఏపీ రైతు సంఘం నాయకులు, సీపీఐ నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తహసీల్దార్ రామాంజనమ్మ పంట పొలాలను పరిశీలించారు. కర్మాగారాల నుంచి వచ్చే కాలుష్యం వల్ల నష్టపోతున్న పొలాలను పరిశీలించారు. రైతులు సమస్యలను తెలుసుకొని కలెక్టర్‌కు నివేదిక పంపిస్తున్నట్లు తహసీల్దార్ అన్నారు. రైతులకు న్యాయం చేయాలని అక్కడి వచ్చిన సీపీఐ నాయకులు, రైతు సంఘం నాయకులు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ రవితేజ, ఆర్‌ఐ బాలకృష్ణ, వీఆర్వో తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా అవెన్యూ ప్లాంటేషన్



ఎర్రగుడి వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ సుబ్బరాజు



నాగిరెడ్డిపల్లిలో మొక్కలు నాటుతున్న ఏపీడీ రమేష్‌నాయక్

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి, శీర్పి, ఆవులెన్న గ్రామాల రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీడీఓ సుబ్బరాజు, ఏపీఓ సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయా గ్రామాల మధ్య మండల ఈఓఆర్‌డీ మాధవ్‌రెడ్డి, టీఏలు స్థానికులతో కలిసి ఎంపీడీఓ మొక్కలు నాటారు. బెళుగుప్ప నుంచి ఎర్రగుడి వరకు 580 మొక్కలు, ఎర్రగుడి నుంచి శీర్పి వరకు 800 మొక్కలు, ఆవులెన్న నుంచి కొట్టాల రోడ్డు వరకు 400 మొక్కలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా భాగంగా నాటినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో టీఏలు అరవింద్, స్వాతి, నాగేంద్రప్ప, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలి

బ్రహ్మసముద్రం : రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించాలని ఏపీడీ రమేష్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాగిరెడ్డిపల్లి నుంచి బ్రహ్మసముద్రం , గొంచిరెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసానాయక్ , ఏపీఓ అవినాష్ , జేఈ జయప్రకాష్, టెక్నికల అసిస్టెంట్లు పండరీష్ , మంజునాథ్, బీఎఫ్‌టీ వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- అనంతపురం మాజీ ఎంపీ తలారి రంగయ్య



శెట్టూరు: బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య



కళ్యాణదుర్గంలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

శెట్టూరు: ఎవరూ అధైర్యపడొద్దు.. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని మాజీ ఎంపీ తలారి రంగయ్య భరోసా ఇచ్చారు. ఎన్నికల ఫలితాలను టీవీలో వీక్షిస్తూ వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టులేక గుండెపోటుతో మృతి చెందిన చెర్లోపల్లి గ్రామ కార్యకర్త హరిజన లక్ష్మయ్య కుటుంబాన్ని మాజీ ఎంపీ పరామర్శించారు. మృతుడి ఇంటి వద్ద లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పంపిన రూ.50 వేల చెక్కును మృతుడి భార్య లక్ష్మీదేవికి అందించారు. కార్యకర్తల కుటుంబాలకు ఏ అవసరమొచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలోని నాయకులు, కార్యకర్తలతో కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి బోయ తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ రాజుకుమార్, జెడ్పీటీసీ మంజునాథ, మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, సర్పంచ్ విరుపాక్షి, ఎంపీటీసీ నరసింహులు, నాయకులు పోస్ట్ రామకృష్ణ, ఎమ్మెస్ రాయుడు, తిప్పేస్వామి, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మల్లేశప్ప, గంగన్న, సుధాకర్ రెడ్డి, రామాంజనేయులు, మల్లికార్జున, ప్రతాప్, హనుమంతురాయుడు, మంజు, పాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి రంగయ్య పరామర్శ

కళ్యాణదుర్గం: కుందుర్పి మండలం బెస్తరపల్లిలో విద్యుదాఘాతంతో మృతి చెందిన రైతు చాకలి దేవరాజ్ కుటుంబాన్ని అనంతపురం మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య మంగళవారం పరామర్శించారు. కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తీసుకొచ్చిన రైతు మృతదేహాన్ని మాజీ ఎంపీ పరిశీలించారు. అనంతరం దేవరాజ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్, నాయకులు కృష్ణమూర్తి, యువజన నాయకులు ఎంఎస్ రాయుడు, రామాంజి, అడ్వొకేట్లు హనుమంతరెడ్డి, ఎర్రిస్వామి, నాయకులు రామిరెడ్డి, ఎర్రిస్వామి, శ్రీకాంత్, పరంధామరెడ్డి, రామాంజి, రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐకమత్యంగా పనిచేయాలి



కొత్తగా ఏర్పాటైన కణేకల్లు తాలుకా కమిటీతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా నాయకులు

కణేకల్లు: ఐక్యమత్యంతో పని చేస్తేనే సమస్యలు, డిమాండ్లకు పరిష్కారం లభిస్తుందని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ జిల్లా కన్వీనర్ ఎండీ షఫీ పేర్కొన్నారు. మంగళవారం కణేకల్లు సీహెచ్‌సీలో కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా కన్వీనర్ మాట్లాడారు. గత 50 ఏళ్ల నుంచి మెడికల్ డిపార్ట్‌మెంటులో ఉద్యోగులు సమస్యలు, కష్టాలను ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య, ఆరోగ్యశాఖలోని ఉద్యోగులను ఒక్కతాటిపై తీసుకొచ్చి వారి సమస్యలపై అసోసియేషన్ తరుపున ఉధృతంగా పోరాటం చేస్తామన్నారు.

ఏపీ హెచ్‌ఏఎంఎస్‌ఏ నూతన కార్యవర్గం ఏర్పాటు...

కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీలో పని చేస్తే వైద్య సిబ్బంది సమావేశమై కణేకల్లు తాలుకా ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కణేకల్లు తాలుకా ఏపీ హెచ్‌ఏఎంఎస్‌ఏ ప్రెసిడెంట్‌గా టీఆర్ రత్నకుమారి (యర్రగుంట పీహెచ్‌సీ), అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా పి.సుజాత (గరుడచేడు పీహెచ్‌సీ), వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు (గరుడచేడు), కార్యదర్శిగా మారుతీ శివరాం (గరుడచేడు), ట్రెజరర్‌గా సిద్దేశ్వరీ (కణేకల్లు సీహెచ్‌సీ), ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్యామల (కణేకల్లు సీహెచ్‌సీ)లు ఎన్నికైనట్లు జిల్లా కన్వీనర్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ జిల్లా కో కన్వీనర్ కోకిల చాముండేశ్వరి, నాయకులు పీవీ కృష్ణమూర్తి, పి.తిప్పేరుద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

జక్కలవడికిలో ఉద్రిక్తత

- టపాసులు తెచ్చిన తంట
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం



అగ్నిగుండం అంటించకుండా అడ్డుకుంటున్న దృశ్యం

కణేకల్లు:మండలంలోని జక్కలవడికిలో మొహర్రం వేడుకల్లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మంగళవారం పానకాల సమర్పణ, విశేష పూజలు జరగాల్సింది. పండగకు పది రోజుల ముందు గ్రామపెద్దలు సమావేశమై, పానకాల రోజు ఎవరూ టపాసులు పేల్చరాదని తీర్మానించారు. దీనికి అన్నివర్గాల వారు అంగీకరించారు. అయితే మంకళవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఒక వర్గం వారు పీర్లకు పానకాల నైవేద్యం తీసుకెళ్లే సమయంలో టపాసులు పేల్చి సామూహికంగా పీర్లచావిడికి బయల్దేరారు. దీంతో వారిపై టపాసులు పేల్చరాదని ముందే తీర్మానిస్తే ఎందుకు పేల్చారని మరో వర్గం వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల వారు వాగ్వాదానికి దిగారు. గ్రామపెద్దలు ఇరువర్గాల వారిని వారించినా ఫలితం లేకపోయింది. రాయదుర్గం రూరల్ సీఐ శ్రీనివాసులు, కణేకల్లు ఎస్‌ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు ఇరువర్గాలవారు శాంతించారు.